ఈనాడు యాదాద్రి భువనగిరి

మంగళవారం అక్టోబరు 22, 2024 5

నియామకం



సోమారం శంకర్

బీబీనగర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధికార ప్రతినిధిగా బీబీనగర్ మండలానికి చెందిన సోమారం శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యాదాద్రిలో వైష్ణవ, శైవారాధనలు



శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో సోమవారం హరి, హరులను కొలుస్తూ చేపట్టిన ఆరాధనలు ఆయా ఆలయాల ఆచారంగా కొనసాగాయి. ప్రధానాలయంలో వైష్ణవ ఆచారమైన పాంచరాత్రాగమ శాస్త్రరీత్యా పంచనారసింహులను ఆరాధిస్తూ నిత్య పూజలు నిర్వహించారు. మూలవరులను మేల్కొల్పి, హారతినిచ్చి నిజాభిషేకం, తులసీ అర్చన చేపట్టారు. మహాముఖ మండపంలో స్వర్ణ పుష్పార్చన కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నిత్యకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గజవాహనంపై కల్యాణమూర్తులను అలంకరించి సేవా పర్వాన్ని జరిపారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, ముత్యాల పల్లకిపై అమ్మవారు అలంకృతులై మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి వేళ స్వయంభువులకు ఆరాధన, సహస్ర నామార్చన నిర్వహించారు. అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాన్యస పూర్వక రుద్రాభిషేకం, బిల్వపత్రితో ప్రత్యేక అర్చన నిర్వహించారు. శివ, పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

అంతటా.. దిగుమతి దిగులు



పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు చేసిన దృశ్యం

భువనగిరి, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థలు ధాన్యం కొనుగోళ్లను సోమవారం నుంచి ప్రారంభించాయి. భువనగిరి నియోజకవర్గంలోని పోచంపల్లిలో వానాకాలం సీజన్ కొనుగోలు ప్రారంభమయ్యాయి. పోచంపల్లి మండల కేంద్రంలోని సెంటర్‌లో 280 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక ప్రారంభమైంది. తేమ శాతం అధికంగా ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. 35 శాతం పైగా కొనుగోలు సంస్థలు ధాన్యం ఖరీదుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పది రోజులకు పైగా ధాన్యాన్ని తీసుకొచ్చి రైతులు అమ్మకాల కోసం ఎదురు చూస్తున్నారు. మరో రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జగదీష్ కొనుగోళ్లను పరిశీలించారు. ధాన్యం దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరించడంతో ప్రస్తుతానికి భువనగిరి, ఆలేరు, రామన్నపేట తదితర ప్రాంతాల్లోని గోదాముల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వంతో మిల్లర్ల చర్చలు సఫలం అయితే దిగుమతి సమస్య తీరుతుంది.

సమస్యలు విని.. అర్జీలు స్వీకరించి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజావాణి వినతులను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. మొత్తం 61 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ శాఖ 42, జిల్లా పంచాయతీ అధికారి 5, మున్సిపాలిటీ 4, జిల్లా ఎంప్లాయిమెంటు 3, పోలీస్, మైనార్టీ, హౌసింగ్, బీసీ స్టాఫింగ్, ఎస్సీ కార్పొరేషన్, ఆర్టీసీ, సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందజేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సూపరింటెండెంట్ ప్యారసింహరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల సమస్యలపై వినతి..

సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. మెస్ ఛార్జీలు పెంపు, సొంత భవనాల నిర్మాణం, బోధన రుసుములు, ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు.

500 మంది సమస్య.. పరిష్కరించండి

– ముదిరాజ్ కులస్థులు, రాయగిరి



తమ శ్మశాన వాటిక, గుడికి వెళ్లేందుకు దారి ఇప్పించాలని భువనగిరి మండలం రాయగిరికి చెందిన ముదిరాజ్ కులస్థులు ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. సుమారు 500 మంది ముదిరాజ్‌లకు సంబంధించి నాలుగు ఎకరాల భూమిని గతంలో కొనుగోలు చేశాం. పక్కన ఉన్న భూమి స్థిరాస్తి వ్యాపారులు లే అవుట్ వేయడంతో దారి లేకుండా పోయింది. శ్మశాన వాటిక, తమ కుల దైవం గుడికి వెళ్లేందుకు అనువుగా ఉన్న దారిని కల్పించాలని ఆ సంఘం నాయకులు ఎర్రల వెంకటేష్, అంకర్ల సంజీవ, బాలరాజు, నాయిని పూర్ణచందర్ కోరారు.

16 ఎకరాలిచ్చినా.. పట్టించుకోవడం లేదు

– సామ యాదగిరిరెడ్డి



ఉన్న వ్యవసాయ భూమిలో ముగ్గురు కుమారులకు ఒక్కొక్కరికి 16 ఎకరాల చొప్పున భూమి పంచాను. ఇప్పుడు నన్ను, నా భార్య పోషణ, ఆలనా పాలన పట్టించుకోవడం లేదు. ఆసరా పింఛన్ రూ. రెండు వేలతో జీవించలేక ఇబ్బందులు పడుతున్నాం. పంచి ఇచ్చిన భూమిలోంచి తిరిగి రెండెకరాల చొప్పున ఆరు ఎకరాల తన పేరిట పట్టా చేయించాలని ఆత్మకూరు మండలం మొరిపిరాల పరిధిలోని ఎలుకబావికి చెందిన సామ యాదగిరిరెడ్డి కలెక్టర్‌ను వేడుకున్నారు.

అడుగడుగునా కూడళ్లు.. కొన్నింటికే దిద్దుబాట్లు

❑ మరిన్నీ అండర్‌పాస్ వంతెనల నిర్మాణానికి ప్రజల వేడుకోలు

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే:

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతా(బ్లాక్ స్పాట్స్)లలో అండర్‌పాస్ వంతెనలు, సర్వీసు రోడ్డు పనులు జాతీయ ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రూ. 282 కోట్లకు టెండర్ దక్కించుకున్న హరియాణాకు చెందిన రామ్‌కుమార్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. ఇక్కడే కాకుండా.. ఇంకొన్ని ప్రాంతాల్లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా చోట్ల అండర్‌పాస్ వంతెనలు లేక జాతీయ రహదారి దాటే సమయంలో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వాటిల్లోనూ అండర్‌పాస్ వంతెనలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించకపోవడంతోనే సమస్య ఏర్పడిందని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కడ అండర్‌పాస్‌లు అత్యవసరం

◆ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పారిశ్రామిక పార్కు ఎదుట అండర్‌పాస్ వంతెన అత్యవసరం. ఈ పార్కులో ఇప్పటికే వందకు పైగా పరిశ్రమలు ప్రారంభం కావడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. రాబోయే రోజుల్లో మరిన్నీ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎదురుగా.. పార్కు నుంచి వచ్చే వాహనాలు టెక్స్‌టైల్ పార్కు ముందు నుంచి వ్యతిరేక మార్గంలో వస్తున్నాయి. పార్కు ఎదురుగానే ఆందోల్ మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల వాహనాలు విజయవాడ మార్గంలో అపసవ్య దిశలో ప్రయాణిస్తున్నాయి. ఆదివారం భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ అండర్‌పాస్ వంతెన నిర్మిస్తే వాహనదారులు, భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

◆ చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం స్టేజీ, పంతంగి స్టేజీ నుంచి ఆరెగూడెం స్టేజీ వరకు అండర్‌పాస్‌లు అవసరం. ఈ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు విడిచారు. పంతంగి గ్రామస్థులు కూడా ప్రజాప్రతినిధులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

◆ చిట్యాల మండలం పిట్టంపల్లి, వట్టిమర్తి, నార్కట్‌పల్లి మండలంలోని గోపాలయపల్లి శ్రీ వేణుగోపాలస్వామి కమాన్, కట్టంగూరు పట్టణం, నకిరేకల్ బైపాస్ ముందు పద్మానగర్ జంక్షన్, అయిటిపాముల వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనలను నిర్మిస్తేనే సమస్యలు తీరతాయి.

◆ మునగాల మండలం తాడ్వాయి క్రాస్‌రోడ్డు నుంచి పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ మనుషులతో పాటు పశువులు మృతి చెందుతున్నాయి. రాత్రి ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నా.. బారికేడ్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం లేదు.

గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో మొదలైన పనులు

యాదాద్రిభువనగిరి జిల్లాలోని దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల దూరంలో 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు గుర్తించారు. ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆదేశించింది. ప్రస్తుతం చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల-జనగామ కూడలి, జమ్మిగడ్డ కూడలి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల చెట్లు కొట్టేశారు.

★ కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), దురాజ్‌పల్లి, నవాబుపేట(ఏపీ) వద్ద పనులను ప్రారంభించాల్సి ఉంది.



చౌటుప్పల్: దండుమల్కాపురం శివారులో ప్రమాదకర కూడలి

వ్యతిరేక దిశలో రాకపోకలు

–గోపాల్‌రావు, తెలంగాణ పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పారిశ్రామిక పార్కుకు ఇప్పుడు రోజూ వెయ్యి వరకు వాహనాలు వస్తున్నాయి. 1800 ఎకరాల్లో విస్తరించి ఉన్న పార్కులో పరిశ్రమలన్నీ ప్రారంభమైతే పది వేలకు వరకు వస్తాయి. పార్కు నుంచి విజయవాడ మార్గంలోకి వ్యతిరేక దిశలో వెళ్లాల్సి వస్తోంది. సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించాలని వారు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు.

రహదారి విస్తరణ సమయంలో నిర్మిస్తాం

– నాగేశ్వర్‌రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్‌హెచ్–65

గత ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం కొన్ని బ్లాక్ స్పాట్‌లలో అండర్‌పాస్ వంతెనలు నిర్మిస్తున్నాం. కొత్తగా అవసరమయ్యే ప్రాంతాల్లో ఆరు వరసల రహదారి విస్తరణ సమయంలో చేపడతాం. విస్తరణ అంశం డీపీఆర్ దశలో ఉంది. వచ్చే ఏడాది పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఓటరు జాబితా సవరణకు స్వీప్ కార్యక్రమాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో ఓటరు జాబితా సవరణ 2024-25కు సంబంధించి ప్రణాళిక బద్ధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై జిల్లా కలెక్టర్లకు వీడియో సమావేశం ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. ఓటర్ జాబితా సవరణ 2024-25 కోసం స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని సూచించారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని, దీనిపై అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబరు 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించాలన్నారు. కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి అమరేందర్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదాద్రికి ఎంఎంటీఎస్ రైలు..?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: తెలంగాణలో పేరొందిన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్ర సందర్శనకు రాష్ట్ర రాజధాని నుంచి వచ్చే యాత్రికులకు సునాయాస ప్రయాణానికి ఎంఎంటీఎస్ రైలు సదుపాయం కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందుబాటులోకి రానుంది. నగర శివారులోని చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఇటీవల సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అక్కడే వెల్లడించిన మాటలతో యాదాద్రి ఆలయ భక్తుల్లో ఆశలు చిగురించాయి. 2016లో ప్రతిపాదన ద్వారా నగరం నుంచి ఎంఎంటీఎస్ రైలు మార్గాన్ని యాదాద్రి రైల్వేస్టేషన్ వరకు నిర్మించే పథకం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వరకే పరిమితం చేశారు. వ్యయ భారంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం వహించకపోవడంతో తాత్సారం చేయడం వల్ల మరో 33 కి.మీ రైలు మార్గం నిర్మితం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే మొత్తం వ్యయభారం భరించేందుకు గతేడాదిలోనే నిర్ణయించింది.



యాదాద్రి క్షేత్రం

సమయం ఆదా.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం యాదాద్రి వరకు వచ్చే ఎంఎంటీఎస్ రైలుమార్గం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీంతో ప్రస్తుతం ఘట్‌కేసర్ వరకు గల సదరు రైలు మార్గం ఈ క్షేత్రానికి దగ్గరలోని రాయగిరి పేరిట గల రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటవుతుంది. ఈ మార్గంతో సికింద్రాబాద్ నుంచి ఇక్కడికి 45 నిమిషాల్లో చేరొచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు. సమయంతో పాటు రవాణా ఖర్చులు ఆదా కాగలవు. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కి.మీ రైలు మార్గానికి అవసరమయ్యే భూ సేకరణకు త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్షేత్ర సమీపాన గల రాయగిరి (యాదాద్రి) రైల్వే స్టేషన్‌ను స్వయంభూ పంచ నారసింహుల దివ్యాలయం నమూనాలో నిర్మించనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.



ఖిల్లా సిగలో.. పచ్చందాల సిరి

ఆకుపచ్చని తివాచీపై భువనగిరి ఖిల్లాను కూర్చొపెట్టినట్లుగా ఉంది. నల్గొండ రోడ్డు వైపు సాగు చేసిన పచ్చని పైర్లు కనువిందు గొల్పుతున్నాయి. ఖిల్లాకు ఒకవైపు ఉన్న ఈ పచ్చని పైర్లు దూరం నుంచి తివాచి పరిచినట్లుగా కనిపిస్తున్నాయి. – భువనగిరి, న్యూస్‌టుడే:

వ్యక్తిగత ఫొటోలు దిగొద్దు: యాదాద్రి ఆలయ ఈవో

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: ఆలయ దేవుడి ప్రతిష్ఠకు భంగం కలగకుండా, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకునే దిశలో ఫొటోలు, వీడియో తీసుకోవడం సరి కాదని యాదాద్రి దేవస్థానం ఈవో భాస్కరరావు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ చేయడంపై మీడియాలో వచ్చిన వార్తలతో ఆలయ ఈవో భాస్కరరావు స్పందిస్తూ ఇక ముందు ఫొటోలు వీడియో తీసుకోవడం అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఆలయం వద్ద భక్తుల మనోభావాలు, భక్తుల విశ్వాసం దెబ్బతినే విధంగా వ్యక్తిగత ఫొటో, వీడియో చిత్రీకరణ చేయొద్దని పేర్కొన్నారు. భక్తి భావంతో జీవితాంతం గుర్తుండేలా ఆలయం బయట ఫొటోలు దిగడం అభ్యంతరం ఉండదన్నారు.

సీఎంఆర్ లక్ష్యం.. బహుదూరం



భువనగిరి: ఈ నెల 6న మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎఫ్‌సీఐ అధికారుల బృందం(దాచిన చిత్రం)

భువనగిరి, న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి చెల్లించడంలో వెనుకబడిపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్‌లో కొన్న ధాన్యాన్ని ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లకు కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చేందుకు ఎఫ్‌సీఐ అక్టోబరు చివరి వరకు గడువు విధించింది. ఆ లోపు లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. త్వరితగతిన సీఎంఆర్ పూర్తిచేసేలా అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

వెనకంజలో సూర్యాపేట జిల్లా

గత రెండు సీజన్లలోనూ నల్గొండ జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్‌ను అప్పగించడంలో ముందంజలో ఉన్నారు. వానాకాలంలో నల్గొండ జిల్లాలో 96 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 90, సూర్యాపేట జిల్లాలో తక్కువగా 61 శాతం బియ్యాన్ని తిరిగి ఇచ్చారు. ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం గడువు పొడిగించే అవకాశాలు కనిపించడంలేదని అధికారులు చెబుతున్నారు.

◆ యాసంగి సీజన్‌కు సంబంధించి కొంత మేరకు మూడు జిల్లాలూ వెనుకబడి ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 67 శాతం, యాదాద్రి భువనగిరి 40, సూర్యాపేట జిల్లాలో కేవలం 27 శాతం మాత్రమే సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇచ్చారు. సూర్యాపేట జిల్లా రెండు సీజన్లలోనూ వెనుకంజలో ఉండటంతో మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ వసూళ్లలో అధికారులు ఉదాసీనతపై ఆరోపణలు ఉన్నాయి.

మధ్యలోనే తనిఖీలు నిలిపి..

మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా తెలుసుకునేందుకు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) అధికారులు అక్టోబరు 6న తనిఖీలు చేపట్టారు. ఒక రోజు పలు మిల్లుల్లో తనిఖీలు చేసి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మధ్యలోనే నిలిపివేశారు.

మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నాం

– జగదీశ్వర్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా

సీఎంఆర్ తిరిగి ఇవ్వడంలో యాదాద్రి భువనగిరి జిల్లా మిల్లర్లు ముందంజలో ఉన్నారు. అయినా గడువులోగా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాం. జిల్లాలో డిఫాల్టైన మిల్లులు లేవు. పూర్తి సీఎంఆర్ సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

2023-24 వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం, సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	సీఎంఆర్ ఇవ్వాల్సింది	ఇచ్చింది	బకాయి
నల్గొండ	3,22,754	2,17,577	2,08,442	9,134
సూర్యాపేట	2,08,114	1,40,154	85,108	55,046
యాదాద్రి	2,65,197	1,78,887	1,58,493	20,394
2023-24 యాసంగి సీజన్‌లో ..				
నల్గొండ	3,26,067	2,21,726	1,49,444	72,282
సూర్యాపేట	2,40,579	1,63,593	44,340	1,19,253
యాదాద్రి	2,70,668	1,84,054	73,387	1,10,667

ద్విచక్ర వాహనాల దొంగకు రిమాండ్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం కానచీర్లకు చెందిన కొంకు గణేశ్ కూలీ పని చేస్తూ తన బంధువులు ఊరైన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెంలో ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు లక్ష్యంగా చోరీలు చేసేవాడు. భువనగిరి పట్టణంలోని బస్టాండ్ వద్ద నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 17న అపహరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిఘా ఉంచగా సోమవారం అనుమానాస్పదంగా వెళ్తున్న నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. సూర్యాపేటలో రెండు, నల్గొండ, మిర్యాలగూడ, కొండమల్లెపల్లి, నేరేడుచర్ల, భువనగిరిలో ఒక్కో ద్విచక్ర వాహనం అపహరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. వాటిని స్వాధీనం చేసుకొని నిందితున్ని న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

'రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం'

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. భాజపా జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చిన రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రైతులకు అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంఛార్జి పట్నం శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ రాజు, కాళభైరవ పాల్గొన్నారు.

రైతేరాజు 6లో..

బంతి సాగు.. ఆదాయం బాగు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: భిన్న సాగులో రాణించి... ఆదాయం గడించాలని అన్నదాతలు ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం వరుస పండగలు ఉండటంతో దీనిని దృష్టిలో ఉంచుకుని అందుకు అత్యధికంగా వినియోగించే పూల సాగును ఎంచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పూల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం చేతికొస్తున్న బంతిపూల దిగుబడితో అధిక ఆదాయం పొందుతున్నారు. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు అక్కడక్కడ బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతానికి తోటల వద్ద కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు రైతులు దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకే విక్రయిస్తూ మరింత ఆదాయం పొందుతున్నారు. మూస ధోరణిలో సాగు చేపట్టకుండా ప్రజల అవసరాల మేరకు విభిన్నంగా ఆలోచన చేసి ఆదాయం పొందుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


సంస్థాన్ నారాయణపురంలో బంతి పూల సాగులో యువకుడు శికిలమెట్ల శివప్రసాద్

రైతేరాజు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో 7,562 ఎకరాల్లో సాగు చేపట్టారు. కాగా గత ఏడాది 5,752 ఎకరాలు చేయగా ఈసారి 1800 ఎకరాల్లో సాగు పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పూలసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగులో చీడపీడల నుంచి నష్టం వాటిల్లకుండా, జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. వర్షాల కారణంగా అక్కడక్కడ దెబ్బతిన్నా బాగున్న వరకు ఆదాయం బాగానే ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సంస్థాన్ నారాయణపురం: బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని బంతి పూల సాగు చేశారు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన శికిలమెట్ల శివప్రసాద్. భిక్షమయ్య-యాదమ్మలకు ఎకరన్నర వ్యవసాయ భూమి ఉంది. పండుగలను దృష్టిలో పెట్టుకొని అర ఎకరంలో బంతిపూల సాగు చేశారు. స్థానిక కంపెనీలో పనికి వెళ్తూ పూల సాగుపై ఆసక్తి చూపి.. పండుగ వేళ దిగుబడి వచ్చేలా పచ్చ, ఎర్ర బంతి సాగు చేశారు. ప్రస్తుతం పూలను తెంపి ఇంటి వద్ద కుప్పలుగా పోసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. కొనుగోలుదారులు ఇంటి వద్దకే రావడంతో ఖర్చులు తగ్గి అన్నుకున్న లాభాన్ని ఆశిస్తున్నారు.



యాసంగిలో వేరుసెనగకు అనుకూల సమయం, రకాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరుసెనగ సాగు చేయడానికి అనుకూల సమయం, రకాల గురించి కంపసాగర్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్‌రావు తెలియజేశారు. వేరుసెనగ తెలంగాణలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న నూనె గింజల పంట. దక్షిణ తెలంగాణలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు రెండో పక్షం వరకు విత్తుకోవచ్చు.

రకం	పంట కాలం	దిగుబడి ఎకరాకు
కదిరి - 6	100, 110 రోజులు	12, 14 క్వింటాళ్లు
కదిరి - 9	110, 120 రోజులు	10 ,12 క్వింటాళ్లు
ధరణి :	100, 105 రోజులు	9, 10 క్వింటాళ్లు
కదిరి 7,8	120, 130 రోజులు	12, 14 క్వింటాళ్లు

యాసంగిలో నీటి పారుదల కింద సాగు చేసేటప్పుడు 22.5, 10 సెం.మీ. దూరంలో ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలి.

సమస్య - సమాధానం

బత్తాయిలో వేరుకుళ్లు తెగులు నివారణ గురించి తెలపండి.

– రామకృష్ణ, హరిజనాపురం గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: నివారణకు రంగాపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటటం శ్రేయస్కరం. వ్యాధి సోకిన తొలి దశలోనే గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటి రోజు కార్బండిజమ్ 2 గ్రా., మాంకోజెట్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి, (చెషంట్) మందును 3 గ్రా., లీటరు నీటికి, 1 శాతం బోరో మిశ్రమాన్ని చెట్ల పాదల్లో నేల తడిచేలా పోయాలి.

వరిలో సుడిదోమ నివారణ గురించి తెలపండి.

సుధీర్‌రెడ్డి, సింగారం గ్రా., మునుగోడు మండలం

సమాధానం: పిలకదశలో దుబ్బుకు 10, 15 అంకురం నుంచి ఈనిక దశలో దుబ్బుకు 20, 25 దోమలు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. తొలి దశలో ఎసిఫేట్ 75 యస్.పి 1.5 లీ., ఇథోపెన్‌ప్రాక్స్ 10 ఇ.సి 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉన్నపుడు డైనోటిప్యూరాన్ 20 యస్.జీ 0.4 గ్రా., పైమెట్రోజైన్ 50 డబ్ల్యూ.జీ., 0.60 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరపలో కాయతొలుచు పురుగు నివారణ గురించి తెలపండి.

– కొండల్, తుంగపాడు గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: ఎకరానికి థయోడికార్బ్ 200 గ్రా., ఎసిఫ్లేట్ 300 గ్రా., క్లోరిఫాస్ 500 మి.లీ., స్పైనోసాడ్ 75 మి.లీ. పిచికారీ చేయాలి. సమగ్ర సస్యరక్షణ అవలంబించాలి.

– త్రిపురారం, న్యూస్‌టుడే



శ్రీనివాస్‌రావు

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771

మానిపండు తెగులు ఆశించకుండా ఉండాలంటే..

త్రిపురారం, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మానిపండు తెగులు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాస్‌రావు తెలిపారు. పంట పూత దశలో గాలిలో అధిక తేమ శాతం, మబ్బులతో కూడిన వర్షపు జల్లులు, మంచు కురవడం వంటివి మనిపండు ఉద్ధృతికి దోహద పడుతుంది. పూత దశలో ఆశించినప్పుడు అండాశయంలో శిలీంధ్రం పెరుగుదల వల్ల ఆకుపచ్చ రంగు ముద్దగా అభివృద్ధి చెంది, పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుంది. నివారణకు ప్రొపికోనజోల్ 2 మి.లీ. కార్బండిజమ్ 50 శాతం డబ్ల్యూపీ 1 గ్రా., టిబుకొనజోల్, ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రా., వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం తర్వాత రెండోసారి పిచికారీ చేయాలి.

జీవితం చదివేద్దాం.. బతికి సాధిద్దాం



కోదాడ, మేళ్లచెరువు, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

మన తాతలు, తండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా.. జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురు నుంచి పది మంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా.. ఫెయిలైనా ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. బలవన్మరణానికి పాల్పడే ముందు ప్రతి విద్యార్థి మన ముందు తరాలు విద్య లేకుండానే బతికారు.. మనం బతకలేమా అని ఒకసారి ఆలోచిస్తే.. ఈ ఆత్మహత్యలు ఉండవు.

కోదాడ పరిధిలోని ఓ ఇంటర్ కళాశాలలో పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివి ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమం చదువు అర్థం కావట్లేదని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంగ్లం కష్టమైతే తెలుగులో చదువుకునే అవకాశం ఉన్నా.. ఆ దారిని ఎంచుకోకుండా క్షణికావేశంలో తనువు చాలించాడు. తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు.

దామరచర్ల మండలంలోని ఓ తండాకు చెందిన తొమ్మిదో తరగతి చదివే బాలిక దసరా సెలవులు ముగించుకొని పాఠశాలకు వెళ్లింది. చదువు ఇష్టం లేదని శుక్రవారం పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మరణించింది. చదువు ఒక్కటే జీవితం కాదు అని ఆలోచించే శక్తి లేక, మరో దారి తెలుసుకోక బాలిక ప్రాణాలు తీసుకుంది.

మేళ్లచెరువు మండలానికి చెందిన ఓ విద్యార్థి గతేడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. ఈ విషయం జీర్ణించుకోలేని ఆ బాలుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు కూలి పనులకెళ్లి చదివిస్తే చివరికి శోక సంద్రంలో ముంచాడు.

భరోసా కల్పించాలి



గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుతుంటారు. ఇంటర్‌లోకి వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్తులో తెలుగులో కంటే ఆంగ్ల మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఉంటాయనే అపోహతో ఇంగ్లిష్ విద్యనభ్యసిస్తున్నారు. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి.. పోటీని తట్టుకొని నిలబడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకు లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు.

★ మొదటి సారి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది.

★ ఫీజుల వసూళ్లపైనే దృష్టి ఉంచకుండా.. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. ★ మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యం పెంపొందించాలి.

★ విద్యాశాఖ అధికారులూ క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని భరోసా కల్పించాలి.

వీరే మనకు ఆదర్శం

☛ కోదాడకు చెందిన గూటి వీరబాబు పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యారు. తర్వాత ఉన్నత చదువులు చదివారు. తాజాగా వచ్చిన డీఎస్సీ ఫలితాల్లో 47 ఏళ్ల వయసులో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ ఆరో తరగతిలోనే చదువు మానేసినా ఆరేళ్ల పాటు వివిధ పనులు చేసుకుంటూ.. తిరిగి దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరారు.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్. పదో తరగతిలో ఐదు సార్లు, డిగ్రీలో ఎనిమిది సార్లు ఫెయిలైనా కుంగి పోకుండా.. కష్టపడి చదివి గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం పొందారు.

☛ ఏళ్ల తరబడి ఉద్యోగం రాక కుంగిపోయిన మిర్యాలగూడకు చెందిన కట్టా సోమిరెడ్డి కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్‌గానూ మారారు. 16 ఏళ్ల తర్వాత గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ నాలుగేళ్లలో 35 ఉద్యోగ అర్హత పరీక్షల్లో ఫెయిలైనా కుంగిపోకుండా 2018లో ప్రయత్నించి సివిల్స్‌లో 104వ ర్యాంకుతో ఏకంగా ఐఏఎస్ సాధించారు.. హరియాణాకు చెందిన విజయ్‌వర్ధన్.

చదువుతోనే జీవితం అవాస్తవం

– వీరేందర్, మానసిక నిపుణుడు, హైదరాబాద్



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. అమ్మానాన్న, అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగాల్లో రాణిస్తారో గుర్తించి, అందులో వారిని ప్రోత్సహించాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువత క్షణికావేశానికి లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


నాగార్జునసాగర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: శ్రీశైలం నుంచి 2,02,730 క్యూసెక్కుల భారీ వరదనీరు వస్తుండటంతో ఎన్నెస్పీ అధికారులు సాగర్ నుంచి 20 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం మేరకు. . అధికారులు 20 గేట్లు 5 అడుగుల మేరకు ఎత్తి 1,59,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమ, వరద కాల్వలు, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్సెల్బీసీల ద్వారా మొత్తం 2,02,730 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. జలాశయ ప్రస్తుత నీటి మట్టం 588.90 అడుగుల వద్ద ఉంది.

టెయిల్‌పాండ్‌లో.. అడవిదేవులపల్లి: ఎగువ ప్రాంతం నుంచి టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతుండగా టెయిల్‌పాండ్ అధికారులు 14 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం.. ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి భారీగా వరద వస్తుండగా టెయిల్‌పాండ్ అధికారులు 13 గేట్లను 3 మీటర్లు, 1 గేటును 2.5 మీటర్లమేర ఎత్తి 2,13,088 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 75.09 మీటర్ల వద్ద ఉందని ప్రాజెక్ట్ ఏఈ జయపాల్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



ఓటరు నమోదుపై దూరదృశ్య శ్రవణ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సాధారణ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై దృష్టి సారించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆర్డీవోలను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలతో సోమవారం దూరదృశ్య శ్రవణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా దరఖాస్తు చేయించాలన్నారు. జిల్లాలో 3500 నుంచి 4 వేల మంది టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకావల్సి ఉందని చెప్పారు. ఈనెల 26లోపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజుల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

28 లోపు ఫీజు చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం డిగ్రీ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈనెల 28లోపు చెల్లించాలని ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఉద్యోగ విరమణలు


గరిడేపల్లి మండలం అప్పన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రం

❍ 65 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయినులు, ఆయాలకు అవకాశం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఉన్నతీకరిస్తూ.. అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. కొంత విద్యార్హత కలిగిన స్థానిక మహిళలను అంగన్‌వాడీలో ఉపాధ్యాయినులు, ఆయాలుగా నియమించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఉన్న వారిలో 65 ఏళ్లు పైబడిన వారిని ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయించింది.

ఆసరా పింఛనుకు వెసులుబాటు

ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు 88 మంది, ఆయాలు 334 మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు. వీరిలో ఉపాధ్యాయినులకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నల్గొండ జిల్లాలో 43 మంది ఉపాధ్యాయినులు ఇప్పటికే ఉద్యోగ విరమణ ప్రతిఫలం అందుకోగా.. మిగిలిన వారికి త్వరలోనే అందనున్నాయి. వీరు ఆసరా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నిబంధనల ప్రకారమే వయసు నిర్ధారణ

నరసింహారావు, జిల్లా సంక్షేమాధికారి, సూర్యాపేట



అంగన్‌వాడీ కేంద్రాల్లో వయసు నిర్ధారణ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగింది. విద్యాశాఖ నుంచి జారీ చేసిన బోనఫైడ్, టీసీ, మార్కుల మెమో, ప్రొవిజనల్ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వయసు నిర్ధారణ చేస్తున్నాం. ఇప్పటికే 65 ఏళ్లు పైబడిన వారు ఉద్యోగ విరమణ చేశారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రకటించిన నగదు రావాల్సి ఉంది.

ఆధారం.. పదో తరగతి మెమో

ఉద్యోగ విరమణ వయసును నిర్ధారించేందుకు పదో తరగతి లేదా ఆపై చదువుల్లో విద్యాశాఖ అందించిన ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం పైగా సిబ్బందిలో ఎటువంటి విద్యా ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో.. వారిని జిల్లాలో ఆసుపత్రుల్లో బోన్ డెన్సిటోమెట్రీ నివేదిక ప్రకారం సుమారుగా నిర్ధారించే వయసు ధ్రువీకరణ ఆధారంగా కలెక్టర్ అనుమతుల మేరకు ఉద్యోగ విరమణ చేయించారు. వీరిలోనూ సిబ్బందికి వేతనాలు చెల్లించే ఈఎంఎస్ పోర్టల్‌లో 65 ఏళ్లు పైబడి వయసు చూపించే వారినే వైద్య పరీక్షలకు పంపించారు. పలు ప్రాజెక్టుల్లో ఆయాలను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వృద్ధులుగా కనపడే వారు, హుషారుగా పని చేయలేని వారిపై ఒత్తిడి తెస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన వారు

జిల్లా	ఉపాధ్యాయినులు	ఆయాలు
నల్గొండ	58	168
సూర్యాపేట	10	57
యాదాద్రి	20	109

శ్రీనివాస్.. సేవల్లో శభాష్


అలువాల శ్రీనివాస్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై అంబులెన్సులో 'ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్'గా విధులు నిర్వహిస్తున్న చౌటుప్పల్‌కు చెందిన అలువాల శ్రీనివాస్ రక్తదాతగా, ఉచిత వైద్య శిబిరాల నిర్వాహకుడిగా, సామాజిక సేవకుడిగా కొన్నేళ్లుగా ప్రశంసలందుకుంటున్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాలకు చెందిన అలువాల శ్రీనివాస్ కుటుంబం 2001లో చౌటుప్పల్‌కు వలసొచ్చింది. కోదాడలోని కేఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి సార్వత్రిక విద్యలో డిగ్రీ చదివారు. అమీర్‌పేటలోని మెడికల్ టెక్నాలజీ కళాశాలలో డీఎంఎల్టీ కోర్సు చదివాక అరబిందో ఫార్మాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడై ఉద్యోగాన్ని వదిలి ఉద్యమకారుడిగా మారారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడేళ్లపాటు ఆర్ఎంపీగా, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతగా సేవలందించారు. తర్వాత నార్కట్‌పల్లిలోని కామినేనిలో ఎమర్జెన్సీ డ్రగ్ డిపార్ట్‌మెంట్‌లో టెక్నీషియన్‌గా మళ్లీ ఉద్యోగంలో చేరి మూడేళ్లు పనిచేశారు. 2020లో జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే 1033 అంబులెన్సులో ఈఎంటీగా నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు.

ప్రత్యేకతలు ఇలా..

- ❍ అత్యవసర సమయంలో ఆపన్నుల కోసం 18 సార్లు రక్తదానం చేశారు.
- ❍ సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 15 ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు.
- ❍ నాలుగేళ్లలో 1033 అంబులెన్సు ఈఎంటీగా సుమారు 2500 మంది రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.
- ❍ మానసిక స్థితి సరిగా లేక జాతీయ రహదారి వెంట తిరిగే ఇరవై మందిని చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో చేర్పించారు.
- ❍ జీఎంఆర్-వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రోడ్డు భద్రత, అవగాహన శిబిరాల్లో పాల్గొని ప్రశంసలందుకున్నారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు కింద పడి యువకుడు బలవన్మరణం చేసుకున్న ఘటన భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మొలుగు సాయి(25) హైదరాబాద్‌లోని జీడిమెట్ల కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. రాయగిరి-వంగపల్లి రైలు మార్గంలో మైలురాయి 248/7-5 వద్ద సోమవారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి గతంలో చనిపోయాడు. తల్లి, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడి రిమాండ్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో 13 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ ఇ.వెంకటరెడ్డి(31)పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 6:30 గంటలకు భువనగిరి బాల సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆ సమయంలో వాష్‌రూంకు వెళ్లి వస్తున్న ఓ బాలికపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ వెంకటరెడ్డి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె విలపించింది. విషయాన్ని బాలల పరిరక్షణ అధికారులకు బాధితురాలు తెలియజేయడంతో విచారణ చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టంలోని సెక్షన్ 7, 8 కింద కేసు నమోదు చేసి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేటు న్యాయస్థానంలో సోమవారం హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


గుగులోత్ వెంకన్న

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతిచెందిన ఘటన మండలంలోని గట్టికల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీపానాయక్‌తండాకు చెందిన గుగులోత్ వెంకన్న(46) గేదెలను తోలుకొని గట్టికల్‌కు చెందిన కోన రాంబాబు కోసిన వరిపొలం మీదుగా వెళ్తున్నాడు. రాంబాబు వ్యవసాయ క్షేత్రంలో పూర్తిగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు వెంకన్నకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కొయ్యకాళ్లపై పడి మృతిచెందారు. ఆయన వెంట వస్తున్న ఓ కుక్క కూడా షాక్‌కు గురై చనిపోయింది. గేదెలు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. మృతుడికి భార్య నీలా, ఒక కుమారుడు, కుమార్తె(వివాహమైంది) ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


ఖమ్మంపాటి మునీశ్వర్

నాగారం, న్యూస్‌టుడే: ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని వర్ధమానుకోటలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగరాజు-ఉపేంద్ర దంపతుల పెద్ద కుమారుడు ఖమ్మంపాటి మునీశ్వర్(11) స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం బిక్కేరు వాగులో ఈతకు వెళ్లి నీటి ఉద్ధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. మిత్రులు భయభ్రాంతులకు లోనై ఎవరింటికి వారు వెళ్లారు. చీకటి పడినా బాలుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అనుమానంతో అతని స్నేహితులను ఆరా తీసినా ఏమీ చెప్పలేదు. పోలీసులు మందలించడంతో వాగులో మునిగిపోయినట్లు చెప్పారు. సోమవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు గాలించగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై ఐలయ్య తెలిపారు.

అమ్మమ్మ ఇంట్లో అంత్యక్రియలు రెండేళ్ల క్రితం బాలుడి తాత ఖమ్మంపాటి యాదగిరికి రెండు కిడ్నీలు పాడవగా ఉన్న ఇంటిని అమ్మి వైద్యం చేయించారు. ప్రస్తుతం ఆ కుటుంబం అద్దె ఇంట్లో ఉంటోంది. నాగారం(బంగ్లా)లో బాలుడి అమ్మమ్మ ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

మహిళా శక్తి పథకంతో ఉపాధి, ఆదాయం

ఆలేరు, న్యూస్‌టుడే: మహిళలకు ఉపాధితో పాటు ఆదాయ పెంపు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిర మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. ఆలేరు మండల



కొలనుపాకలో మహిళలకు కోడి పిల్లలు పంపిణీ చేస్తున్న అదనపు డీఆర్డీవో శ్రీనివాస్

పరిధిలోని గ్రామాల్లో మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకానికి ఎంపికైన ఎస్‌హెచ్‌జీల మహిళలకు సోమవారం కోడి పిల్లలను పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.సంతోష, ఏపీఎం రచ్చ మీనా పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చండి

వలిగొండ, న్యూస్‌టుడే: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, భూ నిర్వాసితుల నాయకుడు దబ్బటి రాములు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను భూ నిర్వాసితుల ఆధ్వర్యంలో అడ్డుకొని చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. ఆంజనేయులు, దశరథ, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మమ్మ, బాలమణి పాల్గొన్నారు.

నీటి సరఫరాలో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు కీలకం

ఆలేరు, న్యూస్‌టుడే: ప్రజలకు రక్షిత నీటిని సరఫరా చేసే విషయంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, సిబ్బంది పనితీరు కీలకమని ఆలేరు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పి.కరుణాకరన్ అన్నారు. ఆలేరులో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ స్థాయిలో రక్షిత నీటి సరఫరా విభాగం క్షేత్ర స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి ప్రారంభమైన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కరుణాకరన్

మాట్లాడారు. సుప్రియ, మహేష్, రాజన్న, లలిత, పి.బంగారయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

రాజపేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మంచినీటి సరఫరా సహాయకులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని భువనగిరి మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ అరుణకుమారి, స్థానిక ఎంపీడీవో నాగవేణిలు ప్రారంభించారు. ఏఈ వెంకటయ్య, ఎంపీవో కిషన్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం: గ్రామాల్లో మంచినీటి సమస్యలు, ఇబ్బందులు లేకుండా చేయడంలో గ్రామాల మంచినీటి సహాయకుల పాత్ర కీలకమైందని మిషన్ భగీరథ జిల్లా పర్యవేక్షణ అధికారి వై.కృష్ణయ్య సూచించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో సోమవారం యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. డీఈఈ బి.పద్మావతి, ఏఈ ప్రజ్ఞ, ఎంపీవో సలీం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందంజ

రాజపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ టీఎస్ యూనియన్ ముందంజలో ఉందని జిల్లా అధ్యక్షుడు కుశ్చ అమరేందర్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విషయమై ఓటరు నమోదు ప్రక్రియ గురించిన ప్రచార కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పాఠశాలల్లో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు శశికుమార్, సుబ్బరాజు, బాలరాజు, మదు పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

భువనగిరి: అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థి దంతూరి సత్యం, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా కోరారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజ్‌లో సోమవారం ఉపాధ్యాయులను కలిశారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమ, భువనగిరి ప్రముఖ్ మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలకు డిమాండ్

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మ ప్రచారక్ సహప్రముఖ్ సుభాష్ సోమవారం పటాన్‌చెరు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో రీల్స్ చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచడం హిందువుల మనోభావాలను కించపరచడమేనని పేర్కొన్నారు. అడ్డుకోకుండా నిర్లక్ష్యం వహించిన దేవాలయ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

రామన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవటంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. ప్రభుత్వం ఏటా పాఠశాలలకు ఇచ్చే క్రీడా వస్తువులు గదులకే పరిమితం అవుతుండగా, క్రీడా ప్రాంగణాలు గ్రామాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 42 ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 12, ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ఒకటి ఉన్నాయి. ఇంద్రపాలనగరం, రామన్నపేటలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, సిరిపురం, వెల్లంకి మునిపంపులలోని ఉన్నత పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. మిగతా పాఠశాలలకు మంజూరు కాలేదు. రామన్నపేటలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయురాలు డిప్యుటే



కక్కిరేణిలోని క్రీడా ప్రాంగణం

షన్‌పై ఇతర ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ ఎవరూ లేరు. ఈ అంశంపై మండల విద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

23న కలెక్టరేట్ ముట్టడి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బోధన రుసుంలు, ఉపకార వేతనాలు చెల్లించకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు చదువు కొనసాగేదెలా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. భువనగిరిలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. మారపాక లోకేష్, రాంపాక చందు, సుమన్, వినయ్ పాల్గొన్నారు.

పీఆర్‌పీఎస్ కార్యకర్తల ర్యాలీ

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో సోమవారం ప్రజా పోరాట సమితి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు యోచనను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరు పాల్గొనాలన్నారు. వరికుప్పల గోపాల్, శంకరయ్య, వెంకటయ్య, అంజయ్య, శంకర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦ సిమెంటు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో జీపుజాత నిర్వహించారు. సిరిపురంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అఖిలపక్ష నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థిని లెంకల మనశ్విని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20న గుర్రంపోడు మండలం కొప్పోలులో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో విద్యార్థిని పాల్గొన్నారు. అండర్-18 విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందుకు ప్రిన్సిపల్ శోభారాణి, పీటీ రమేశ్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు.



లెంకల మనశ్విని

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం మండలంలోని మర్యాలలోని ప్రధాన వీదిలో మురుగు కాల్వలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే శుభ్రం చేయాలి. -రాములు, మర్యాల.

✔ గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియ జేసి మురుగు కాల్వను శుభ్రం చేయిస్తాం. -రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, మర్యాల.



చౌటుప్పల్‌లో అవగాహన పత్రాలను విడుదల చేస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎల్.యశోద

పోషకాహార లోపాన్ని నివారించండి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: పోషకాహార లోపాన్ని నివారించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎల్.యశోద కోరారు. తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్యవేక్షకులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.సుమన్‌కల్యాణ్, డా.కాటం రాజు, డా.సంపత్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారులు సత్యనారాయణ, ఇస్తారి, పీహెచ్‌ఎన్ శశికళ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని నిరసన

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పాలక ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఏబీవీపీ నల్గొండ విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ ఆరోపించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరసన ప్రదర్శలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూపల్లి దీపిక, హరీష్, శివకుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

బీబీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ చెల్లించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రాఘవాపురంలో సోమవారం జరిగిన సీపీఎం గ్రామశాఖ 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. సీపీఎం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా బాబు, సహాయ కార్యదర్శిగా మల్లేశంలను ఎన్నుకున్నారు.

యాదవ, గొల్ల, కురుమలు నమ్మకానికి పేరు : ఎమ్మెల్యే బీర్ల

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదవ, గొల్ల, కురుమలంటే నమ్మకానికి మారుపేరు అని, ఏ ప్రభుత్వాల్లో, పార్టీల్లోనైన వారికి పెద్దపీట వేస్తారని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్టలో సోమవారం యాదవ సత్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. యాదవ, గొల్ల, కురుమలు ఐక్యంగా ఉండి, గత ప్రభుత్వ కాలంలో హైదరాబాద్ నడిబొడ్డున 10 ఎకరాల స్థలం, రూ.10 కోట్లు సాధించుకోగలిగారని గుర్తు చేశారు. సత్ర నిర్మాణానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వం నుంచి తన సహాయ, సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ యాదగిరిగుట్టలో అన్ని హంగులు, ఆధునిక వసతులతో యాదవ సత్రం నిర్మించేలా ట్రస్ట్ చేపట్టిన ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్, నాయకులు చింతల రవీందర్, వేణుగోపాల్, దారబోయిన శ్రీనివాస్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోటకొండూరు: మోటకొండూరు మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలో బీటీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగా రూ.2 కోట్లతో మోటకొండూరు నుంచి చాడ వరకు బీటీ రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తహసీల్దార్ శాంతిలాల్, నాయకులు సుబ్రమణ్యం, మల్లేష్, మహేందర్, యూన్సి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం: పోలీసు అమరుల దినోత్సవాన్ని సోమవారం యాదగిరిగుట్టలో నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఏసీపీ రమేష్, పుర అధ్యక్షురాలు సుధ, పలువురు నివాళి అర్పించారు.



యాదగిరిగుట్టలో.. యాదవ సత్ర భూమి పూజలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, తదితరులు

శ్రీరామెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

యాదగిరిగుట్ట పట్టణం: హైదరాబాద్‌లో ఈనెల 25, 26న జరిగే ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాలను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేతుల మీదుగా సోమవారం యాదగిరిగుట్టలో ఆవిష్కరించారు. సుర్వంగ ప్రకాశ్, కొత్త లలిత, సంతోశ్, పాండరి, శ్రీహరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మూసీ శుద్ధీకరణ డీపీఆర్‌ను ప్రజల ముందుంచాలి: సీపీఎం

ఆలేరు, న్యూస్‌టుడే: మూసీ నది శుద్ధీకరణకు సంబంధించిన సమగ్ర వివరాలు ప్రజల ముందుంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ అన్నారు. ఆలేరులో సోమవారం జరిగిన సీపీఎం ఆలేరు పట్టణ మహాసభలో మాట్లాడారు. మూసీ శుద్ధీకరణ చర్యలకు సీపీఎం మద్దతు ఉంటుందని, ఇదే క్రమంలో ప్రాజెక్టుకు వ్యయం చేసే రూ.లక్షా 49 వేల కోట్ల నిధులను ఎక్కడి నుంచి సమకూర్చుతారనే విషయాన్ని ప్రజలకు తెలియాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొండమడుగు నర్సింహ, ఎంఎ.ఎక్బాల్, దూపటి వెంకటేశ్, మొరిగాడి రమేష్, చెన్న రాజేష్ పాల్గొన్నారు.

మద్యనిషేధంలో ఆదర్శంగా నిలవాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మద్యనిషేదం అమలును దిక్కరించిన వారిపై మహిళల నిర్ణయం మేరకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ హెచ్చరించారు. పురపాలిక పరిధి తాళ్లసింగారంలో మహిళా సంఘాల పిలుపు మేరకు ప్రజలతో పోలీసులు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై లక్ష్మణ్, మాజీ సర్పంచి సుర్వి నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మందారి మార్క్, మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, మంజుల, సంగీత, సుజాత, ఓలమ్మ, జయమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల డిమాండ్ మేరకు నీటి సరఫరా

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజల డిమాండ్ మేరకు నీటిని సరఫరా చేస్తామని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో సోమవారం బోరు తవ్వకాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకున్న కౌన్సిలర్ పడిగెల రేణుక, నాయకులు జహంగీర్, ప్రదీప్‌కుమార్, మంజుల, స్వామి, పరమేష్, బాల్‌నర్సింహ, మధు, శివ, యాదమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దాడికి ఖండన.. సంస్థాన్‌నారాయణపురం: సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మతల్లి విగ్రహం ధ్వంసంపై తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎన్‌టీయూసీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే బడేసాబ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అవగాహన.. ఆత్మకూరు(ఎం): ప్రపంచ అయోడిన్ లోప దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్.వంశీ కృష్ణ అయోడిన్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నియామకం.. మోత్కూరు: తెలంగాణ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా మోత్కూరుకు చెందిన పాస్టర్ కాపర్తి సైమన్ నియామకమయ్యారు. సోమవారం స్థానిక క్రైస్ట్ కల్వరి చర్చిలో నిర్వహించిన జిల్లా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.బాబును నియమిస్తూ ఆ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీటర్ నియామకపత్రాలను అందజేశారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దయాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి.. మోత్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా, పురపాలికల్లో వార్డుసభ్యుల ద్వారా ఎంపిక చేయాలని భారాస మండల, పుర అధ్యక్షులు పి.రమేష్, జంగ శ్రీనులు అన్నారు. సోమవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అనిల్, శైలజ, పిచ్చయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అవగాహన.. భూదాన్‌పోచంపల్లి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలపై సోమవారం యువతకు అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. వెంకటేశం, శ్రీనివాస్, రాజశేఖర్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.. భువనగిరి నేరవిభాగం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతల శివ అన్నారు. భువనగిరిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవాని శంకర్, సతీష్, చింటూ పాల్గొన్నారు.

రద్దు చేయొద్దు.. మోత్కూరు.. మోత్కూరులో 40 ఏళ్లకు పైగా కొనసాగిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేయవద్దని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్ డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌గౌడ్, అనిల్, సాయి ఉన్నారు.

వెంకటాచారికి అవార్డు.. బీబీనగర్: విద్యారంగంలో చేసిన కృషికి గాను బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గడగోజు వెంకటాచారి టీచర్ ఎక్సలెన్స్ అవార్డు-2024కు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయనకు పురస్కారం అందజేసి సన్మానించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల రహిత కోటగా తీర్చిదిద్దాలి.. భువనగిరి పట్టణం: భువనగిరి కోట పరిసరాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనంజేయులు అన్నారు. కోట ప్రాంగణంలో సోమవారం ఇన్‌క్రెడబుల్ ఇండియా, టూరిజం శాఖ సంయుక్తంగా చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పర్వతా రోహకురాలు పడమటి అన్వితా రెడ్డి, అధ్యాపకులు, రాక్ క్లైంబింగ్ అకాడమీ మేనేజర్ రాకేష్ వినోద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి..భువనగిరి గ్రామీణం: రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బండ కృష్ణ తమ వ్యవసాయ బావి వద్ద గేదె మేత మేసుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు నియంత్రిక తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. కాగా గేదె సుమారు రూ.80 వేల విలువ ఉంటుందని బాధితుడు తెలిపారు. గేదె మృతితో జీవనాధారం కోల్పోయానని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

శంకుస్థాపన...సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని ఎస్‌బీహెచ్ పక్క వీధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహారావు, పీఆర్ఏఈ జానయ్య, పగిళ్ల శ్రీనివాస్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

సీపీఎం పోరాట ఫలితమే బునాదిగానికాల్వకు నిధులు..మోత్కూరు: బునాదిగాని కాల్వ కోసం సీపీఎం చేసిన పోరాట ఫలితంగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అన్నారు. సోమవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. బునాదిగానికాల్వ పూర్తికి ప్రభుత్వం రూ.267 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వెంకటనర్సు, పి.చంద్రారెడ్డి, ప్రభాకర్, రమేష్, ఉన్నారు.

భాజపా మండల అధ్యక్షుడిని సస్పెండ్ చేయాలి..అడ్డగూడూరు: ఒంటెద్దు పోకడలతో సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ కార్యకర్తలను విస్మరిస్తున్న భాజపా మండల అధ్యక్షుడు ననుబోతు సైదులును తక్షణమే సస్పెండ్ చేయాలంటూ ఆ పార్టీ కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు ఏనుగు బీరుమల్లు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక భాజపా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నరేందర్, ఇమ్మానియేల్, యాదగిరి, ఆంజనేయులు, కృష్ణ, రాములు, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

ప్రారంభించాలని డిమాండ్.. బొమ్మలరామారం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మండలంలోని రైతులు డిమాండ్ చేశారు. ధాన్యం కేంద్రాల్లో పోసి పది రోజులు అవుతున్నా అధికారులు, నాయకులు స్పందించడం లేదని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కోరారు. బీబీనగర్ మండలం అన్నంపట్ల, ఎర్రబెల్లితండా, బ్రాహ్మణపల్లి పెద్దపలుగుతండా, లక్ష్మీదేవిగూడెం, జంపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. బీబీనగర్ మండల ప్రత్యేక అధికారిణి సుభాషిణి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి పద్మ, ఏపీఎం శ్రీనివాస్, నాయకులు పింగళిరెడ్డి, శ్యామ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు, పహిల్వాన్‌పురం, ఏదుల్లాగూడెం, ప్రొద్దుటూరు తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సత్తిరెడ్డి, కిష్టయ్య, రవి, సంజీవరెడ్డి, సాగర్‌రెడ్డి, రవీంద్ర, సతీశ్, అనంతరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



వలిగొండ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, తదితరులు

పోలీసు అమరుల స్ఫూర్తితో విధులు నిర్వహిస్తాం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల స్ఫూర్తితో విధులు నిర్వహిస్తామని ఆత్మకూరు సీఐ పి.సోలోమన్ రాజు అన్నారు. 2006లో ఆత్మకూరు ఠాణాపై మావోయిస్టుల దాడిలో అప్పటి ఎస్సై ఎమ్డీ.చాంద్ పాషా, ఏఎస్సై ఖాజామొయినొద్దీన్, హోంగార్డు లింగయ్య, 2015లో జానకీపురం వద్ద సిమీ ఉగ్రవాదులతో జరిగిన ఎదుకాల్పుల్లో మరణించిన ఎస్సై డి.సిద్దయ్య, కానిస్టేబుల్ సీహెచ్.నాగరాజుల చిత్రపటాలకు పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్, సిబ్బంది రామచంద్రయయ్య, నరేందర్, శివచారి, గాయత్రి, ప్రేమలత పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం) ఠాణాలో పోలీసు అమరులకు నివాళి అర్పిస్తున్న సీఐ సోలోమన్ రాజు, సిబ్బంది

సిమెంటు పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటాం

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని పరిశ్రమ ఏర్పాటు స్థలం వద్ద సోమవారం భారాస కార్యకర్తలతో కలిసి ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సిమెంటు పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు కానివ్వమన్నారు. పోచబోయిన మల్లేశం, నీల దయాకర్, అశోక్, శ్రీనివాస్, సుదీర్‌బాబు, నర్సింహ, సంతోశ్ పాల్గొన్నారు.



రామన్నపేటలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రాజానగరంలో విషాద ఛాయలు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం రాజానగరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి మృతితో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జగ్గరాజు వెంకటేశ్ రాజు(20) ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం లింగాయన్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నారు. స్నేహితులతో కలిసి ఆదివారం సమీప గ్రామమైన మాదలదారిగూడెం చెరువులో స్నానాలు చేసేందుకు వెళ్లిన క్రమంలో నీట మునగడంతో మృతి చెందారు. గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టమ్ నిర్వహించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. కాగా పెద్ద కుమారుడు నీలం రాజు మూడేళ్ల క్రితం మనస్తాపంతో వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్య చేసుకోగా మిగిలిన ఒక్క కుమారుడు చెరువులో పడి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం ఆకాశన్నంటింది.



వెంకటేశ్ రాజు

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరులోని సేక్రెడ్‌హార్ట్ హైస్కూల్‌లో 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలలో సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ జానయ్య, పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎం.బాలశౌరి, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు నగలున్న బ్యాగ్ అప్పగింత

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బస్సులో తారుమారైపోయిన బంగారు నగలున్న బ్యాగ్‌ను కనుక్కొని తిరిగి అందజేశారు పోలీసులు. నగలతో పాటు బ్యాగును సోమవారం భువనగిరి ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ బాధితులకు అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో అంబర్‌పేటలోని గంగానగర్ కాలనీలో నివాసం ఉంటున్న గజ్జి జ్యోతి దసరా పండగకు తన తల్లిగారు ఊరైన మహబూబాబాద్ జిల్లా కే.సముద్రానికి వెళ్లారు. తిరిగి ఈ నెల 14 హైదరాబాద్‌కు వచ్చేందుకు తొర్రూరులో ఆర్టీసీ బస్సు ఎక్కారు. తన బ్యాగ్‌ను బస్సులో ఉండే క్యాబిన్‌లో పెట్టారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు భువనగిరి బస్టాండ్‌లో తన బ్యాగ్ అనుకొని జ్యోతి బ్యాగ్‌ను తీసుకొని దిగారు. తన బ్యాగ్ తారుమారైన విషయాన్ని గమనించిన ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో ఏడు తులాలు బంగారు ఆభరణాలు ఉండటంతో పోలీసులు పోయిన బ్యాగును కనుక్కునేందుకు విచారణ చేపట్టారు. బస్టాండ్‌తో పాటు, పరిసరాల సీసీ కెమెరాలు ద్వారా బ్యాగ్‌ను తీసుకు పోయిన వ్యక్తిని గుర్తించారు. ఆభరణాలతో ఉన్న బ్యాగ్‌ను కనుక్కొన్నారు. తిరిగి స్వాధీనం చేసుకొని సోమవారం అప్పగించారు.

ధర్మయుద్ధ సదస్సు జయప్రదం చేయాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 29న ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మాదిగల ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ, నల్ల చంద్రస్వామి పిలుపు నిచ్చారు. యాదగిరిగుట్టలో సోమవారం అనుబంధ సంఘాలతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. మంద శంకర్, బూడిద జానీ, ప్రభాకర్, గోపాల్, హరీశ్, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చౌటుప్పల్‌గ్రామీణం, చౌటుప్పల్: నల్గొండలో ఈనెల 29న మాదిగల ధర్మయుద్ధ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి తెలిపారు. చౌటుప్పల్‌లో ఆయన సోమవారం మాట్లాడారు.

మోత్కూరు సీడీపీవో మాకొద్దని నిరసన

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు మండలం దాచారం ఒకటో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ వెంపటి లక్ష్మీరాజ్యం(64) సోమవారం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు నెలల క్రితం లక్ష్మీరాజ్యం పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పీడీ, మోత్కూరు సీడీపీవోలు తనిఖీ చేశారని, ఆ సందర్భంగా వృద్ధురాలైన లక్ష్మీరాజ్యాన్ని వారు బాగా తిట్టి, అనరాని మాటలు అనడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైందని, పైగా ఆ మరుసటి రోజు సమావేశం పెట్టి మందలించడంతో ఆమె ఇంటికి వెళ్తూ ద్విచక్రవాహనంపై నుంచి పడి కోమాలోకి వెళ్లిందని అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.శోభ, మోత్కూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మందడి ఉపేంద్ర, బయ్యాని భారతి ఆరోపించారు. సోమవారం లక్ష్మీరాజ్యం మృతిచెందగా ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లంతా దాచారం వెళ్లి నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి భాగ్యలక్ష్మీ, నర్మద, సునిత ఉన్నారు.

✦ ఈ విషయమై సీడీపీవో జ్యోత్స్నను వివరణ కోరగా. . పీడీ, తాను సదరు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసినప్పుడు 260 గుడ్లు పంపిణీ చేసినట్లు రికార్డులో రాసిపెట్టి ఉండగా, గుడ్లు మాత్రం పంపిణీ చేయకుండా అలాగే ఉన్నాయని చెప్పారు. దీంతో ఆమెను మందలించి, షోకాజ్ నోటీస్ జారీ చేయమని పీడీ ఆదేశించిందన్నారు. తదుపరి సమావేశంలోనూ ఆమెను మందలించలేదని, తాను ఎవరి పట్ల దురుసుగా ప్రవర్తించడం లేదని చెప్పారు. ఆరోపణల్లో నిజం లేదన్నారు.

రూ.20 వేలు అందజేత.. అంగన్‌వాడీ టీచర్ వి.లక్ష్మీరాజ్యం ద్విచక్రవాహనం పైనుంచి పడి, సుమారు రెండు నెలలుగా కోమాలో ఉండి సోమవారం మృతిచెందడంతో ఆమె అంత్యక్రియల కోసం మోత్కూరు సీడీపీవో కార్యాలయం నుంచి రూ.20 వేలను సూపర్‌వైజర్లు జ్యోతి, మధురమ్మ, ఎండీ.షమీంబీ, యాకూపాషాలు కలిసి ఆ కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు.